సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 7, అక్టోబర్, 2024



తెగులు.. దిగులు

భారీ వానల తర్వాత గారెత్తించే ఎండలతో వరికి తెగుళ్లు సోకుతున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలి.

- 8లో



రోడ్డు ప్రమాదంలో..

చోడవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. మృతునిది చెన్నాపురం.

- 8లో

15న సిరిమానోత్సవం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవాలకు సంబంధించి అమ్మవారి జాతర విశేషాలను ఆదివారం దండోరా వేశారు. ఈ నెల 14న అమ్మవారి తొలేళ్ల సంబరాలు, 15న సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం ఘటాలతో చాటింపు వేస్తూ కోట వద్దకు వెళ్లి, అక్కడ కోటశక్తికి మనవి చెప్పారు.

న్యూస్‌రీల్

ఆదిత్యుని సన్నిధిలో భక్తుల సందడి

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. స్థానిక జిల్లా నుంచే కాక ఇరుగుపొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత మంచినీరు, ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద భోజనాన్ని కల్పించేలా ఆలయ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో అధికార సిబ్బంది తగు చర్యలు చేపట్టారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి మూలవిరాట్టుకు అలంకరించి పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించారు. ఒక్కరోజులో దర్శన టిక్కెట్ల రూపంలో రూ.1,47,500, విరాళాల రూపంలో రూ.80,709, ప్రసాదాల విక్రయాల రూపంలో రూ.1.70 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా అధికారులు తెలియజేశారు.

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో మూడు కొత్త హైర్ బస్సులు, శ్రీకాకుళం రెండో డిపో పరిధిలో రెండు కొత్త హైర్ బస్సులు మొత్తం ఐదు కొత్త బస్సులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తామని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం మరో 1500 నుంచి 2000 బస్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి విజయవాడ ఇంద్ర బస్సును మళ్లీ పునరుద్ధరించామన్నారు. శ్రీకాకుళం 1,2 డిపోల పరిధిలో 11 బస్సులను కొత్తగా రన్నింగ్‌లోకి తెచ్చామని త్వరలో మరో 30 బస్సులు రావాల్సి ఉందన్నారు.

యూటీఎఫ్ జట్టు రన్నరప్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవ క్రీడా పోటీల్లో శ్రీకాకుళం జిల్లా రన్నరప్‌గా నిలిచింది. అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు గుంటూరులో జరిగిన పోటీల్లో ఏలూరు చాంపియన్‌గా నిలవ గా, శ్రీకాకుళం రన్నరప్‌గా నిలిచింది. మొత్తం 24 టీమ్‌లు పాల్గొన్నాయి.



ఇచ్ఛాపురం: కూష్మాండ అవతారంలో స్వేచ్ఛావతి అమ్మవారు



పాతపట్నం: లలితా త్రిపురసుందరిగా నీలమణిదుర్గ



కోటబొమ్మాళిలో ఏర్పాటుచేసిన 20 అడుగుల దుర్గాదేవి విగ్రహం



శ్రీకాకుళం కల్చరల్: చిన్మయమిషన్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

అవతార రూపిణి నవరాత్రి వేడుకల సందర్భంగా అమ్మవారిని వేర్వేరు రూపాల్లో అలంకరించి అర్చిస్తున్నారు. ఆలయాలతో పాటు మండపాల్లోనూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

వెజి'ట్ర'బుల్స్



- దారెత్తిస్తున్న టమాటా
- నానాటికీ పెరుగుతున్న ఉల్లి ధరలు
- బెంబేలెత్తిపోతున్న సామాన్యులు
- నాలుగు నెలలుగా ఏమాత్రం తగ్గని వైనం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ), ఎల్ఎన్ పేట:

దండిగా శుభ కార్యాలు ఉన్నాయి. ఆపై అసలే దసరా రోజులు. నవరాత్రులు ఊరూరా జరుగుతున్నాయి. దీనికి తోడు మాలధారులు కూడా పెరుగుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా టమాటా అయితే బయట మార్కెట్‌లో కిలో రూ.100 పలుకుతోంది. దీంతో అన్ని వర్గాల వారూ ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నుంచి టమాటా, ఇతర కూరగాయల రైతులకు సాగు ప్రోత్సాహకం లేకపోవటం, వర్షాలు, తెగుళ్ల కారణంగా వీటి సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో వీటికి గిరాకీ పెరిగిపోవటంతో ఆయా రాష్ట్రాలకు మన రాష్ట్రంలో పండించిన పంట తరలించుకుపోతున్నారు. దీంతో టమాటా, ఇతర కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

టమాటాతో పాటు ఉల్లి ధరలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయి. నాలుగు నెలల కాలంలో 10 సార్లు మాత్రమే వీటి ధరలు తగ్గాయి. మిగిలిన అన్ని రోజులు పెరుగుతూనే ఉన్నాయి. మరోవైపు అల్లం, వెల్లుల్లి ధరలు అదేబాటలో నడుస్తున్నాయి. ఇటీవలే నూనె ధరలు సైతం బాగా పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జనం నెత్తిన ధరల భారం పెంచారే తప్ప సంక్షేమం మాత్రం ఏమాత్రం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నిత్యావసరంగా ఉన్న ఉల్లి, టమాట ధరలు అమాంతంగా పెరగడంతో చేతి చమురు వదులుతోందని పేద, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు నెలలుగా ఉల్లి రూ.50–రూ.60 గానే బహిరంగ మార్కెట్‌లో ఉంటే టమాటా తానేమీ తక్కువ కాదని ఏకంగా రూ.100 ఉంది. రైతు బజార్లు ఉన్న చోట మాత్రమే కాస్త తక్కువ ధరకు ఉల్లి, టమాటా దొరికినా బహిరంగ మార్కెట్‌లో మాత్రం డిమాండ్‌ను బట్టి ధరలు పెంచుతూ అమ్మకాలు చేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో మొదటి రకం ఉల్లిపాయలు కిలో రూ. 70 ఉండగా, రెండో రకం రూ.50కి విక్రయిస్తున్నారు. గత నాలుగు నెలలుగా ఉల్లి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉల్లిపాయల ఉత్పత్తి ఎక్కువగా ఉండి ఎగుమతులు చేసే మహారాష్ట్ర, కర్నూలులో దిగుబడులు తగ్గడంతోనే ఉల్లి ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నట్లు చెబుతున్నారు. టమాటా విషయానికి వస్తే బెంగళూరు, మదనపల్లెలో పంటల దిగుబడి రాకపోవడంతో ధరలు తగ్గడం లేదని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఏం కొనలేం.. ఏం తినలేం



ఉల్లి లేనిదే ఏ కూర వండలేం. టమాటా కూడా ఎక్కువగా వాడతుంటాం. ఇప్పుడు కేవలం మచ్చుకి ఒకటి రెండు వేసి సరిపెట్టుకుంటున్నాం. ప్రభుత్వం రాయితీపై ఉల్లి, టమాటాలు అందిస్తే బాగుంటుంది.

– బైరాగి జయంతమ్మ, బాయమ్మతోట, శ్రీకాకుళం



టమాటా, ఉల్లి ధరలు భారీగా పెరిగినప్పుడు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రాయితీపై వినియోగదారులకు ఉల్లిపాయలు సరఫరా చేసేవారు.

ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం...

బహిరంగ మార్కెట్‌లో రూ.100 ఉంటే రైతుబజార్లు, రైతుభరోసా కేంద్రాల్లో సబ్సిడీతో సగం ధరకే ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ధరలు నియంత్రణకు ఎలాంటి ప్రయత్నం చేయకపోగా కనీసం ప్రజల నిత్యవసరాల వస్తువులు, కూరగాయల్ని సబ్సిడీపై మార్కెట్లలో ఇచ్చే ప్రయత్నం కూడా చేయడం లేదు. వచ్చే నెల నుంచి కార్తీకం కావడంతో మరీ దారుణంగా ధరలు పెరిగిపోయే అవకాశం ఉందని హోటల్ యజమానులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

16 నుంచి కొత్త రీచ్‌లు

- అందుబాటులో ఆరువేల మెట్రిక్ టన్నుల ఇసుక
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు: ఎస్పీ



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు 16వ తేదీ నుంచి జిల్లాలో కొత్తగా ఆరు రీచ్‌లు ప్రారంభం కానున్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇసుక కొరత లేదని, ప్రస్తుతానికి 6000 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఇసుక బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సరఫరా చేస్తున్నామని వివరించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలను నిర్వహించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా కేటాయించడం జరుగుతోందని, ఇసుక కావాల్సినవారు ఎవరైనా సాండ్ పాలసీ వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. లేదంటే వారి సమీపంలోని సచివాలయానికి వెళ్లి బుక్ చేసుకోవచ్చని చెప్పారు. వినియోగదారులు సొంతంగా వాహనం తెచ్చుకుంటే, దానిలో ఇసుక నింపి తీసుకువెళ్లవచ్చని, అలాగే జిల్లాలో ఆర్టీఓ వద్ద నమోదు చేసుకున్న, జీపీఎస్ విధానంతో అనుసంధానించిన 522 వాహనాలు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీలను చెల్లించి ఇసుకను తీసుకువెళ్లవచ్చునని సూచించారు. ఇసుక బుక్ చేసిన ప్రతి వినియోగదారునికి ఇసుక చేరే ముందు ఫోన్ వస్తుందని, ఇసుక అన్‌లోడ్ అయిన తర్వాత ఓటీపీ వస్తుందని అన్నారు. తూనిక, నాణ్యత లేకపోతే అధికారులకు తెలియజేయాలని, ఓటీపీ నంబర్ ఇవ్వకుండా ఉండాలని తెలిపారు. అలాంటి పరిస్థితులో లోపాలకు కారణమైన వారిపై దర్యాప్తు చేసి, చర్యలు ఉంటాయని వివరించారు. ఇసుక పొందడంలో సమస్యలు ఎదురైతే, 24 గంటలూ పనిచేసే జిల్లా స్థాయి ఫెసిలిటేషన్ సెంటర్‌ను సంప్రదించవచ్చునని, అలాగే టోల్ ఫ్రీ నంబర్ 18004256012, వాట్సాప్ నంబర్ 9701691657 ను సంప్రదించవచ్చని అన్నారు.

ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినా, అక్రమంగా ఇసుకను రవాణా చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు అక్రమార్కులపై రూ.5.75 లక్షలు జరిమానా కూడా విధించామని, పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో జిల్లా స్థాయి, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. సమావేశంలో శ్రీకాకుళం ఆర్టీఓ కె.సాయి ప్రత్యూష కూడా ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శన

నరసన్నపేట: స్థానిక ఇందిరా నగర్‌కు చెందిన నమో వేంకటేశాయ కోలాట భజన బృందం తిరుమల బ్రహ్మోత్సవాల్లో కోలాట ప్రదర్శన చేసింది. ఆదివారం ఉదయం బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల మాడవీధుల్లో కోలాట నృత్యం చేశారు. బృందం లీడర్ మెండ కృష్ణవేణి, దుర్గాభవానీ, సీతామహలక్ష్మి, పుష్పలత లతో పాటు మరో 19 మంది పాల్గొన్నారు.



తిరుమలలో కోలాట ప్రదర్శన చేసిన వేంకటేశాయ కోలాట భజన బృందం

చనిపోయిన పది నెలలకు దహన ఖర్చులు

- గార ఎస్‌బీఐ ఉద్యోగిని చనిపోయినప్పుడు ఇవ్వని దహన ఖర్చులు
- కేసు ఉచ్చు బిగుస్తుండటంతో ఇప్పటికి ఇచ్చేందుకు సిద్ధపడిన ఎస్‌బీఐ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్ : గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన గార ఎస్‌బీఐ బంగారం కేసులో బ్యాంకు అధికారుల లీలలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసును జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో డీఎస్పీ సీహెచ్ వివేకానంద అందరి నిందితులపైనా ఓ కన్నేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచ్చు బిగిస్తుండటంతో..

తన కుమార్తెను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని ఆరోపిస్తూ ఆమె తల్లి ఉరిటి సరళా దేవి జాతీయ మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్లకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ఇప్పటికే పోలీసులు అప్పటి ఆర్ఎం రాజు, బ్రాంచి మేనేజర్ రాధాకృష్ణ, క్యాషియర్ ముంజేటి సురేష్, ఫీల్డ్ ఆఫీసర్ చింతాడ శ్రీనివాస్, నలుగురు ఆడిటర్లు, ఇతర బ్యాంకు ప్రతినిధులందరినీ పిలిపించి విచారించారు. ఆర్ఎం రాజునైతే డీఎస్పీ కార్యాలయంలో ఐదు రోజుల పాటు విచారించారు. ఈ విచారణలో గత ఏడాది నవంబరు 29న చనిపోయిన స్వప్నప్రియకు దహన ఖర్చులు సైతం ఇవ్వలేదన్న విషయాన్ని పోలీసులు గ్రహించారు. దీంతో ఆ బ్యాంకు ప్రతినిధులు ఇన్నాళ్లకు ఆ ఖర్చులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

గార ఎస్బీఐ బంగారం మాయం కేసులో గత ఏడాది నవంబరు 29 ఉదయాన అకౌంటెంట్ ఉరిటి స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. అప్పటి వరకు ఆమెపై ఫిర్యాదు ఇవ్వని ఆర్ఎం రాజు, బ్రాంచి మేనేజర్ రాధాకృష్ణలు ఆ మరుసటి రోజు రాత్రి బ్యాంకులో బంగారం మాయం చేయడంలో కీలకపాత్ర స్వప్నప్రియదేనంటూ ఫిర్యాదు చేయడం ఒకెత్తు అయితే.. అంతేకాక బ్యాంకు నార్మ్స్ ప్రకారం చనిపోయిన ఒక్కరోజులోనే లేదంటే బ్యాంకువాళ్లు సన్నిహితాన్ని బట్టి 11 రోజులలోపు ఇవ్వాల్సిన దహన సంస్కార ఖర్చులు అప్పుడు ఇవ్వకపోగా.. కేసు ఉచ్చు బిగిస్తుండటంతో కంటితుడుపు చర్యగా వారి కుటుంబసభ్యులకు ఇప్పుడిచ్చేందుకు సిద్ధపడటం మరో ఎత్తు.



స్వప్నప్రియ తల్లిని కలిసేందుకు వచ్చిన గార ఎస్బీఐ మేనేజర్ సతీష్, సిబ్బంది

ప్రస్తుత గార ఎస్బీఐ మేనేజర్ సతీష్‌తో పాటు, సిబ్బంది శనివారం సాయంత్రం ఉరిటి స్వప్నప్రియ ఇంటికి వెళ్లి ఆమె తల్లి సరళని కలిసి మట్టి ఖర్చుల నిమిత్తం ఇస్తున్నామంటూ రూ. 25 వేలు చేతిలో పెట్టబోయారు. తమకు ఆ డబ్బులు ముట్టినట్టుగా స్వప్నప్రియ చనిపోయిన తేదీతో ఉన్న ధ్రువీకరణ పత్రం మీద సంతకం పెట్టమనడంతో స్వప్నప్రియ తల్లి సరళ, సోదరుడు కిరణ్ నిరాకరించారు. ఈ రోజు తేదీ అయితేనే సంతకం పెడతామని, లేదంటే తమ బ్యాంకు ఖాతాలో జమ చేయండని చెప్పారు. చాలాసేపు నచ్చజెప్పి డబ్బులు ముట్టజెప్పేందుకు ప్రయత్నించిన బ్యాంకు అధికారులు బెడిసికొట్టడంతో అక్కడినుంచి వెనుదిరిగారు.

9న జిల్లా అండర్‌-15 చెస్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–15 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఈనెల 9వ తేదీన జరగనున్నాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్ తెలిపారు. శ్రీకాకుళం నానుబాలవారి వీధిలో ఉన్న చెస్ శిక్షణ కేంద్రంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. వివరాలకు 99125 59735 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



దసరా వేళ ముక్కంటి పూజ




మట్టి కుండలతో అందంగా అలంకరించుకున్న కిశోర బాలికలు

- దసరా వేళ శివుని ఆరాధనలో కిశోర బాలికలు
- మూడు రోజుల పాటు శాకాహార భోజనాలు

ఇచ్ఛాపురం రూరల్: దసరా వేళ ఉద్దానం పల్లెల్లో ఓ వినూత్న సంప్రదాయాన్ని అనాదిగా పాటిస్తున్నారు. ఉత్కళ బ్రాహ్మణులు ఉండే ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మూడు రోజుల పాటు శివున్ని పూజించే ఆనవాయితీ ఉంది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం కొళిగాంలో సుమారు వంద వరకు ఒరియా బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయి. పౌరోహిత్యం, అర్చకులుగా వీరు చాలా ఏళ్లుగా పనిచేస్తున్నారు. తమ మాతృభాష ఒడియాతో పాటు తెలుగును ధారాళంగా మాట్లాడతారు. అశ్వయుజ శుక్ల పక్షం పంచమి రోజు నుంచి మూడు రోజుల పాటు వీరు అత్యంత భక్తితో శివుడిని ఆరాధిస్తారు. ఆ రోజున కిశోర బాలికలకు అభ్యంగన స్నానం చేయించి తమ తాహతకు తగ్గట్టుగా అలంకరణ చేస్తారు. వేకువజాము తొలి రేయిలో బాలికలు ఇసుకను సేకరించి దానితో శివాలయం ప్రాంగణంలో 'సైకత శివ లింగం' తయారు చేస్తారు. ఈ సందర్భంగా సైకత శివ లింగం చుట్టూ వృత్తాకారంలో కూర్చొని ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దసరా వరకు శివారాధనలోనే ఉంటూ అరటి పండ్లు, పెరుగన్నం మాత్రమే ఆహారంగా స్వీకరిస్తారు. ఈ మూడు రోజుల పాటు బాలికలు శివుడి జటాజూటం మాదిరి 'శివుడు జడ'ను వేసుకుంటారు. చివరి రోజున మట్టి కుండలను అందంగా అలంకరించి అందులో పానకంను నైవేద్యంగా ఉంచి గ్రామ పొలిమేరలో ఆ మట్టి కుండలను పగులకొడతారు.

పూరీ నుంచి వచ్చిన సంప్రదాయం



పూరీ జగన్నాథ స్వామి ఆలయంలో ఉండే అర్చకులు మా వంశీయులే. ఏటా దేవీ నవరాత్రుల సమయంలో వచ్చే అశ్వయుజ శుక్ల పక్షం 'పంచమి' రోజు చాలా ప్రాముఖ్యమైనది. ఈ రోజున కిశోర బాలికలు అందంగా అలంకరించి శివుని జడలు వేసుకుంటూ నిష్ఠతో శివునికి పూజలు చేస్తారు. పూరీ అర్చకులు సైతం ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తుంటారు.

– అనంతరామ్ మహాపాత్రో, విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు, కొళిగాం

క్లుప్తంగా

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఫుట్‌బాల్ జిల్లా జట్టుతో ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న అంతర్ జిల్లాల సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు హాజరయ్యే జిల్లా జట్టును స్థానికంగా ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఆసక్తి గల ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎంపికలకు హాజరు కాగా 16 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ మంచి టీమ్‌ను ఎంపిక చేశామన్నారు. సెలెక్షన్ ప్రక్రియలో కుంచి గోపి, నవీన్‌కుమార్, రమేష్, అరవిందుకుమార్, సృజన్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట ఉద్యమం స్ఫూర్తిదాయకం

సోంపేట: సోంపేటలో చేపట్టిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమం స్ఫూర్తిదాయకమని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. మానవ హక్కుల నేత బాలగోపాల్ 15వ సంస్మరణ సభ సుందరయ్య విజ్ఞాన భవన్ హైదరాబాద్‌లో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోంపేట థర్మల్ ఉద్యమంపై మానవహక్కుల నాయకురాలు కె.అనురాధ రచించిన బీల కోసం–బతుకు కోసం సోంపేట హరిత ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని మానవహక్కుల వేదిక నాయకులు ఆవిష్కరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



లోయలోకి దూసుకుపోయిన కారు

ఇచ్ఛాపురం రూరల్: కునుకుపాటు ఆ కుటుంబ సభ్యుల్ని చావు అంచుల వరకు తీసుకువెళ్లింది. కోల్‌కతాకు చెందిన నీలాబ్జీ దాస్ కుటుంబ సభ్యులు తమ సొంత కారులో ఆదివారం వేకువజామున వైజాగ్ వెళ్లేందుకు బయల్దేరారు. మధ్యాహ్న సమయంలో బెర్హంపూర్ వద్ద భోజనం చేసి స్థానిక-16 నంబర్ జాతీయ రహదారి గుండా వస్తుండగా, బెల్లుపడ–ఈదుపురం జంక్షన్ వద్దకు వచ్చే సరికి డ్రైవింగ్ చేస్తున్న నీలాబ్జీ దాస్ కునుకుపాట్లు పడటంతో వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న లోయలోకి దూసుకు పోయి మట్టి దిబ్బను ఢీకొట్టి ఆగిపోయింది. అక్కడున్న వారు కారు వద్దకు వెళ్లి ప్రయాణికులను క్షేమంగా బయటకు తీశారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అదరగొట్టిన సిక్కోలు క్రికెటర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్రాష్ట్ర అండర్-19 పురుషుల వన్డే క్రికెట్ వినూమన్కడ్ ట్రోఫీ (యూత్ లిస్ట్–ఏ మ్యాచ్‌లు) క్రికెట్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (ఏసీఏ) బోణీ కొట్టడంలో శ్రీకాకుళం జిల్లా స్టార్ క్రికెటర్లు నంబళ్ల సుశాంత్, రాజాన జున్నారావు కీలకభూమిక పోషించారు. బీసీసీఐ ఆధ్వర్యంలో మొహాలీలోని ఐఎస్ బింద్రా క్రికెట్ స్టేడియం పీసీఏ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా ఆదివారం ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏసీఏ 122 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్రా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 371 పరుగులు చేయగా.. జట్టులో వన్‌డౌన్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన నంబళ్ల సుశాంత్ 62 బంతుల్లో 5 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 53 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అలాగే బౌలింగ్‌లో మీడియం పేసర్ రాజాన జున్నారావు పది ఓవర్లు బౌలింగ్ చేసి 44 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు.

ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ సంఘ జిల్లాశాఖ ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఎస్ఈఎస్ఏ) శ్రీకాకుళం జిల్లా శాఖ ఎన్నికైంది. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కె.రంగాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎ.సూర్యప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా విద్యాశాఖ మినిస్టీరియల్ సిబ్బంది ఏకతాటిపైకి వచ్చి సమష్టిగా నూతన జిల్లా కార్యవర్గం ఎన్నికలను చేపట్టారు. ఎన్నికల అధికారులుగా ఏపీఎస్ఈఎస్ఏ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పి.ఆనందరెడ్డి వ్యవహరించారు.

జిల్లా నూతన కార్యవర్గం ఇదే

శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్షునిగా కె.రంగాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎ.సూర్యప్రకాశ్, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా బి.జగదీష్, కోశాధికారిగా ఎల్.రమేష్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ నిరోషా, కె.శ్యామలరావు, జి.శేఖర్‌రావు, జి.శ్రీనివాసరావు, సీహెచ్ నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.శరత్‌కుమార్, మహిళా కార్యదర్శిగా పి.పద్మావతి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.సతీష్‌కుమార్, పి.బెనర్జీ, డి.సుమన్, బి.గణేష్, బి.ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా పి.తేజాలక్ష్మి, పి.తేజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తెగులు.. దిగులు

- జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వరి పైరుకు తెగుళ్లు
- అప్రమత్తం అవసరం అంటున్న నిపుణులు



వరి పైరుకు సోకిన ఎండు ఆకు తెగులు

వ్యవసాయ సహాయక సంచాలకులు రవీంద్రభారతి

జలుమూరు: వరికి తెగుళ్లు సోకుతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. గడిచిన నెల వరకూ వర్షాభావ పరిస్థితులు, ఆపై అతివృష్టి, సాగునీరు, ఎరువులు, కూలీల కొరత, కలుపు నివారణతో అవస్థలు పడిన రైతన్నలు ఇప్పుడు తెగుళ్లతో ఆందోళన చెందుతున్నారు. ఉష్ణోగ్రత పెరగడంతో వరి పైరుకు అధికంగా తెగుళ్లు సోకుతాయని, వీటిని నివారించేందుకు అప్రమత్తంగా ఉండడంతో పాటు నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.58 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా అత్యధికంగా జలుమూరులో 19,849 ఎకరాలు, అత్యల్పంగా కవిటిలో 2,120 ఎకరాల్లో సాగవుతున్నట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. వరి నాట్లు, వెదలు పూర్తయ్యి దాదాపు 90 రోజులు దాటుతుండడంతోపాటు ఈ పైరు చిరుపొట్ట దశకు చేరుకున్నాయి. ఇటీవల ఉష్ణోగ్రతలు పెరగడంతో చాలా చోట్ల వరికి తెగుళ్లు సోకుతున్నాయి. ఈ సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించుకోవచ్చనని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి పైరుకు అగ్గి తెగులు, పాడ తెగులు, ఎండాకు తెగులు సోకుతున్నాయి. వాతావరణం వేడెక్కడం, పైరుకు కావాల్సినంత నీరు లేకపోవడం వల్ల తెగుళ్లు వ్యాప్తి చెందుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అగ్గి తెగులు

వరి పైరు ఆకుమీద చిన్న డైమండ్ వంటి ఆకారంతో మచ్చలు ఏర్పడతాయి. అనంతరం ఆకు అంతా వ్యాప్తి చెంది నల్లగా మారి దుబ్బంతా మొక్కంతా మాడి పోతుంది.

నివారణ

అగ్గి తెగులు నివారణకు సైక్లోజిన్‌బాన్ ఎకరాకు 120 గ్రాములు ఫౌడర్ నీటిలో కలిపి సుమారు 150 లీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే పెస్టో సైక్లిన్ 18 గ్రాములు నీటిలో కలిపి ఎకరాకు 150 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.

పాడ తెగులు

వరి పైరుకు మొదటి భాగం నుంచి ఈ తెగులు సోకుతుంది. మొదటి భాగంలో పాడ పాము మీద ఉన్న మచ్చలు ఉన్నట్లే వరి పైరు దుబ్బుకు సోకి కింద నుంచి పైకి వెళ్తుంది. అలాగే వరి దుబ్బంతా మచ్చలతో మారి ఎండి పోతుంది.

నివారణ

పొలం గట్ల మీద ఉన్న గడ్డిని పూర్తిగా తొలగించడం అవసరమైతే ఆ గడ్డిని కోసేయడం వల్ల కూడా నివారణ చేసుకోగలము. వీటితోపాటు పాడ తెగులు నివారణకు కాంటాఫ్ ఎకరాకు 400 మిల్లీ లీటర్లు 150 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే అవతార్ అర కేజి పౌడర్ తగినంత నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే నివారణ చేసుకోగలం.

ఎండు ఆకు తెగులు

వరి పైరులో ఆకులకు ముందుగా ప్రారంభమై ఈ తెగులు చివరి వరకూ సోకుతుంది. ఆకుపచ్చని రంగును క్రమేపీ హరించి వరి ఆకులన్నిటినీ బూడిద రంగులోకి మార్చేస్తుంది. దీని వల్ల ఆకులతోపాటు వరి పిలకలు అన్నీ ఎండిపోయి దుబ్బు చచ్చిపోతుంది.

నివారణ

ఎండు ఆకు నివారణకు ప్లాంటా మాసిన్ 100 గ్రాములు లేదా 200 గ్రాములు ఎండోఫిల్ జెడ్ 78 పిచికారి చేసుకుంటే నివారించుకోగలం.

ఇసుక, లిక్కర్ మాఫియాలకు అడ్డాగా ఆమదాలవలస



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ప్రశాంతతకు మారుపేరుగా ఉండే ఆమదాలవలస నియోజకవర్గాన్ని ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాలకు అడ్డాగా స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ తయారు చేశారని, ఆ మాఫియాల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతాడ రవికుమార్ మాట్లాడుతూ గత 4 నెలలుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూన రవికుమార్ తన ఇసుక మాఫియాను రంగంలోకి దించి యథేచ్ఛగా ఇసుకను దోచుకుంటూ రోజుకు రూ.2కోట్లు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు దిగుతున్నారని అన్నారు. రెండు రోజులుగా మద్యం షాపులకు టెండర్ల విషయంలో కూడా ఇదే విధంగా తన మాఫియాను దించి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కూన రవికుమార్ నేరుగా షాపులకు టెండర్లు వేసిన వారికి ఫోన్ చేసి ఆమదాలవలస నియోజక వర్గం నాది, ఇక్కడ ఎవరూ టెండర్లు వెయ్యకూడదని, తన మాట కాదని టెండర్లు వేస్తే వారి అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి సంస్కృతి ఎక్కడో బీహార్‌లో ఉంటుందని విన్నామని, అదే సంస్కృతికి ఇప్పుడు ఆమదాలవలస నియోజకవర్గంలో కూన రవి తెర లేపుతున్నారని పేర్కొన్నారు. త్వరలో ఒక ప్రణాళికాబద్ధంగా ఈ మాఫియా ఆగడాలను అడ్డుకుంటామని చింతాడ రవికుమార్ అన్నారు.

సమావేశంలో ప్రచారవిభాగం జిల్లా ఉపాధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, పార్టీ కార్యకర్తలు అన్నెపు కృష్ణ, బుడుమూరు రామ్మోహన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ



ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

పలాస: పలాస డివిజన్‌లోని ఏడు మండలాల పరిధిలో ఉన్న ఉద్దానం ప్రాంతం కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం కావాలని, అందుకు పాలక వర్గాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, పౌర సమాజం కూడా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల్లో తగిన చైతన్యం తీసుకురావాలని ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ప్రొఫెసర్ కేఎస్ చలం చెప్పారు. పలాస మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం కళింగ సీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చలం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఎంతో లోతైన చరిత్ర ఉందని వివరించారు. ఎవరికీ లొంగని ఈ ప్రాంతం, ఈ ప్రాంత ప్రజలు నేడు కిడ్నీ వ్యాధి బారిన పడి మృత్యువాత పడటం చాలా బాధాకరమన్నారు. దీని నుంచి బయట పడాలంటే పౌరసమాజం అప్రమత్తంగా ఉండాలని, గతం కన్నా ఐక్యంగా ఉండాలని, పాలక వర్గాలపై ఒత్తిడి పెంచాలని, మెరుగైన వైద్య సదుపాయాలకోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పుస్తక సంపాదకులు బద్రి కూర్మారావు, పలువురు ప్రముఖ వైద్యులు డాక్టరు ఎం.మల్లేశ్వరరావు, డాక్టరు తెప్పల ఆనంద్, డాక్టరు గిరిబాబు, డాక్టరు ఖగేశ్వరరావు, బమ్మిడి సుబ్బారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం



ఆసక్తిగా సాగుతున్న కబడ్డీ పోటీ

ఎచ్చెర్ల క్యాంపస్: రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి మహిళల అండర్–19 కబడ్డీ పోటీలు ఆదివారం కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ పోటీలకు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. అలాగే క్రీడా జ్యోతి వెలిగించి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. ఉమ్మడి జిల్లాల్లో 13 జట్ల నుంచి 156మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. సోమవారంతో ఈ పోటీలు ముగియనున్నాయి. కార్యక్రమంలో జిల్లా పీఈటీ అసోషియేషన్ అధ్యక్షులు మొజ్జాడ వెంకటరమణ , నాయకులు పైడి వేణుగోపాలం, విశ్వక్సేన్, సర్పంచ్ పైడి భాస్కరరావు, ఎంపీటీసీ సూర జగదీశ్వరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, హెచ్ఎం బీవీ సాయిరాం పాల్గొన్నారు.

ఆలిండియా యోగా పోటీల్లో రోహిణి అ'ద్వితీయం'



రావాడ రోహిణిని అభినందిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా యోగా పోటీల్లో జిల్లాకు చెందిన రావాణి రోహిణి అ'ద్వితీయ'మైన ప్రదర్శనతో సత్తాచాటింది. జలుమూరు మండలం లింగన్నాయుడుపేట గ్రామానికి చెందిన ఈ యువ యోగా క్రీడాకారిణి ఇటీవల చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయ్ వేదికగా జరిగిన ఆలిండియా పోలీస్‌క్లస్టర్ యోగా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించడమే కాకుండా రజత పతకంతో మెరిసింది. జిల్లాకు చెందిన రావాడ రోహిణి తూర్పుగోదావరి జిల్లా పోలీసుశాఖలో సైబర్ ల్యాబ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఈమె గతంలో విశాఖపట్నం, జలంధర్, నాగూర్‌లలో జరిగిన ఆలిండియా పోలీస్ యోగా పోటీల్లో పాల్గొని విజయ బావుటా ఎగురవేసింది. తాజాగా జాతీయ పోటీల్లో మెరిసిన రావాడ రోహిణిని డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు, స్పోర్ట్స్ ఐజీ, తూర్పుగోదావరి ఎస్పీ డి.నరసింహాకిషోర్, అదనపు ఎస్పీ అల్లూరి వెంకటసుబ్బరాజు తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చోడవరం కూడలి వద్ద ప్రమాద దృశ్యం



మృతుడు కర్రి అప్పన్న (ఫైల్)

నరసన్నపేట: మండలం ఆర్అండ్‌బీ రహదారిపై చోడవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నాపురానికి చెందిన దుండంగి కర్రి అప్పన్న(50) మృతి చెందారు. శనివారం ప్రమాదం జరగగా గాయపడిన అప్పన్నను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. అల్లాడ గ్రామంలో బంధువుల ఇంటికి శుభ కార్యక్రమానికి వెళ్లి సైకిల్‌పై తిరిగి వస్తుండగా 3.30 సమయంలో చోడవరం సెంటర్ వద్దకు వచ్చే సరికి అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అప్పన్నకు బలమైన గాయాలు కాగా వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ మృతి చెందాడు. మృతునికి భార్య అశిరమ్మ కుమారులు కార్తిక్, మధు ఉన్నారు. భార్య అశిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదంపై నరసన్నపేట ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్కవరంలో ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామంలో ఈ నెల 9న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రవేశ రుసుం లేదని, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 9 లోగా 9908784656 నంబరుకు సంప్రదించాలన్నారు. విజేతలకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

ఎవరైనా లాటరీలో పాల్గొనవచ్చు

- ఎక్సైజ్ డీపీఈఓ సీహెచ్ తిరుపతినాయుడు



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న డీపీఈఓ తిరుపతినాయుడు

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం దుకాణాలకు టెండర్ వేసే వ్యక్తి తన తరఫున మరొకరితో దరఖాస్తు చేయించవచ్చని, లాటరీలో కూడా వేరే వ్యక్తి పాల్గొనవచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (డీపీఈఓ) సీహెచ్ తిరుపతినాయుడు అన్నారు. ఈ మేరకు కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని, దరఖాస్తుదారుడు పంపించిన వ్యక్తి దరఖాస్తుతో పాటు ఆథరైజేషన్ లెటర్ (ధ్రువీకరణ పత్రం) తప్పక సమర్పించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. జిల్లాకేంద్రంలోని తమ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం పత్రికా సమావేశం డీపీఈఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు ఆఫ్‌లైన్‌లో 158 దుకాణాలకు గాను 260 దరఖాస్తులు అందాయన్నారు. శనివారం వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి 248 దరఖాస్తులు అందాయన్నారు. తమ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి ఎప్పటికప్పుడు దరఖాస్తుల ప్రక్రియ పరిశీలిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు శ్రీకాకుళం 32 షాపులకు గాను 74 దరఖాస్తులు రాగా, రణస్థలంలో 15 షాపులకు 66, పలాస 15 షాపులకు 32 అధికంగా దరఖాస్తులు అందాయన్నారు. అత్యల్పంగా సోంపేటకు 12కి 2, టెక్కలి 11కి 2, పాతపట్నం 8కి రెండు అందాయన్నారు. ఆమదాలవలసలో 13కు 18, పొందూరులో 10కి 18, నరసన్నపేటలో 12కి 10, కొత్తూరులో 7కి 13, కోటబొమ్మాళిలో 15కు 11, ఇచ్ఛాపురంలో 8 షాపులకు 12 దరఖాస్తులు అందాయన్నారు. తిరుపతినాయుడుతో పాటు సమావేశంలో సీఐ ఎంవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

- ఒకరి మృతి,ఇద్దరి పరిస్థితి విషమం
- ఫ్యూజన్ బ్రిక్స్ పరిశ్రమ కూలీల నివాసంలో ఘటన
- మృతుడు జిల్లా వాసి



మృతుడు కేశవరావు (ఫైల్)



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర, సిబ్బంది

యలమంచిలి రూరల్ : మండలంలోని ఫ్యూజన్ పరిశ్రమ ఆవరణలో కూలీలు నివాసముంటున్న షెడ్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ కూలీ మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడుతున్నారు. యలమంచిలి మండలం లైన్ కొత్తూరు పంచాయతీ శివారులో ఫ్యూజన్ బిల్డింగ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఉంది. ఇక్కడ సిమెంట్ ఇటుకలు తయారు చేస్తారు. ఒడిశా సహా, మన రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చిన కూలీలు పనిచేస్తున్నారు. పరిశ్రమ ఆవరణలోనే కార్మికుల కోసం 12 రేకుల షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్‌లో ముగ్గురేసి చొప్పున కార్మికులు ఉంటున్నారు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో డ్యూటీ దిగిన బడకల కేశవరావు, లోకనాథ్, కృష్ణారెడ్డి అనే ముగ్గురు కూలీలు వంట చేసుకునేందుకు షెడ్‌లోకి వెళ్లారు. అప్పటికే వంట గ్యాస్ సిలిండర్ లీకై గ్యాస్ వ్యాపించి ఉంది. గమనించకుండా లైట్ ఆన్ చేయడంతో ఆ స్పార్క్‌కు ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ముగ్గురు కార్మికులు మంటల్లో కాలిపోతూ బయటకు పరుగులు తీశారు. వీరిని పరిశ్రమకు చెందిన కారులో యలమంచిలిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారికి చికిత్స చేసే పరిస్థితి లేదని సిబ్బంది చెప్పడంతో షీలానగర్ కిమ్స్ ఐకాన్‌కు తరలించారు.

అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. 85 శాతానికి పైగా శరీరం కాలిపోవడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం పత్రిపుట్టుగకు చెందిన బడకల కేశవరావు(52)మృతి చెందాడు. మృతునికి భార్య రాజులమ్మ, కుమారులు శశి, శ్రీకాంత్, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం కేశవరావు పరిశ్రమలో పని చేస్తూ ఊహించని రీతిలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎం.లోకనాథ్, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహానీ గ్రామానికి చెందినవాడు. జి. కృష్ణారెడ్డి కూడా సుహానీ గ్రామం శాంతినగర్ నివాసి. వీరి పరిస్థితి విషమంగా ఉంది. యలమంచిలి సీఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, అగ్నిమాపకాధికారి రాంబాబులు ఆదివారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. శనివారం రాత్రే కేజీహెచ్‌కు వెళ్లిన పోలీసులు.. క్షతగాత్రుల నుంచి వాంగ్మూలం సేకరించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఆ షెడ్‌లకు అనుమతులూ లేవు..

ఏడాది కిందట వీరంతా ఓ కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా ఫ్యూజన్ పరిశ్రమలో ఉత్పత్తి విభాగంలో రోజువారీ కూలీలుగా చేరారు. మెరుగైన వసతి కల్పిస్తామని నమ్మబలికి పరిశ్రమలో పనికి తెచ్చిన యాజమాన్యం, కాంట్రాక్టర్.. పరిశ్రమ ఆవరణలో ఓ మూలన నిర్మించిన రేకుల షెడ్లను గదులుగా చేసి వసతి కల్పించారు. షెడ్డులో వెంటిలేషన్ కూడా లేకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని చెబుతున్నారు. అయితే ఈ షెడ్లకు గ్రామ పంచాయతీ అనుమతులూ లేవని తెలిసింది. మృతుడు కేశవరావు కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ యలమంచిలి నేత చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు.

చెక్‌పోస్టులో తనిఖీలు తప్పనిసరి



పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన లారీ డ్రైవర్ నుంచి వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు

రణస్థలం: జిల్లా నుంచి వెళ్లే వాహనాలను పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద తప్పనిసరిగా తనిఖీ చేయాలని అనుమతులంటేనే విడిచి పెట్టాలని లేదంటే వెంటనే సీజ్ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. మండలంలోని పైడిభీమవరం వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఇసుక చెక్ పోస్టును కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఆర్డీఓలు పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్, రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించి కెమెరాలు ఉన్న స్థలంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, తనిఖీ కేంద్రం కూడా పక్కాగా షెడ్ నిర్మాణం కలిగి ఉండాలని ఆదేశించారు. ప్రతి రోజు జిల్లా నుంచి పైడిభీమవరం వచ్చే ప్రతి ఇసుక లారీ ఇక్కడ నమోదు కావాలని సూచించారు.

ఆదివారం 66 లారీలు తనిఖీ చేశామని, ఒక లారీకి ఎలాంటి అనుమతులు లేవని అక్కడి సిబ్బంది చెప్పారు. ఆ లారీ డ్రైవర్‌ను పిలిపించి ఆరా తీశారు. నారాయణపురం నుంచి వైజాగ్ దగ్గర ఆనందపురం వెళ్తున్నానని చెప్పగా.. బూర్జ మండలంలోని నారాయణపురం నుండేనా అంటూ.. వెంటనే అక్కడ సిబ్బందిని సస్పెండ్ చేయాలని జేసీ, ఆర్డీఓలకు అదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా డ్రైవర్ మాట్లాడుతూ తమకు పని అప్పగించిన వాళ్లు ఒడిశాకు చెందిన నకిలీ బిల్లు కూడా ఇచ్చారని కలెక్టర్‌కు చూపించారు. చెక్‌పోస్టులో తనిఖీలు పక్కాగా జరగాలని, మౌలిక వసతుల ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, తనిఖీ అధికారులు ఉన్నారు.

ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో చోరీ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో గత నెల 30న చోరీ జరిగిందని బాధితుడు రిటైర్ ఉద్యోగి మానంగి నాగేశ్వరరావు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ ఇచ్చిన వివరాలు మేరకు.. ఎస్‌బీఐ స్టాఫ్‌లో నివసిస్తున్న నాగేశ్వరరావు తన కొడుకు వద్దకు ఈనెల 26న జార్ఖండ్ వెళ్లారు. అయితే 30వ తేదీ నాటికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం, డోర్ లాక్ బ్రేక్ చేయడంతో పైన అద్దెకు ఉన్న వారు బాధితుడు నాగేశ్వరావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వచ్చి అన్నీ పరిశీలించి 83 గ్రాములు విలువ చేసే బంగారు చైన్‌లు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

• 58 ఏళ్ల తర్వాత..



హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1967-68 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం స్థానిక శ్రీరామేశ్వరి డిగ్రీ కళాశాల ఆవరణంలో అపూర్వ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డబ్బై ఏళ్ల వయసు దాటిన వారు చిన్ననాటి నేస్తాలతో ఆత్మీయంగా గడిపారు.

– హిరమండలం